**కథ**

# బుల్లి తెర మాయరోగం

## ఉదయం తొమ్మిది గంటలవుతోంది.

**ఆ ఇంట్లో అందరూ మౌనంగా ఉన్నారు. అత్త వర్ధనమ్మ, కోడలు శైలజ, కూతురు వనజ అందర్లోనూ ఒకటే ఆలోచన. ఒకటే టెన్షన్.**

''ఏమయింది? నీరజ కొంపతీసి చచ్చిపోలేదు కదా?'' మనసులో అనుకోబోయిన శైలజ బయటకే అనేసింది.

వర్ధనమ్మ కుతకుతలాడిపోతోంది.

''ఎవరు తీసిన గోతుల్లో వాళ్ళే పడతారని ఊరకే అంటారా? చావకేమవుతుంది? చచ్చే ఉంటుంది. అది ఛస్తేనే కథకు అందం'' అంది.

''అంటే..తప్పంతా నీరజదేనంటారా?''

''కాక..దానికదేం బుద్ధి? అత్తగారిని హతమార్చాలనుకోవడం తప్పు కదా? కొడుకు ప్రేమించానన్నాడు. కులం పిల్లకాదని తల్లి అభ్యంతరం చెప్పింది. కొడుకు వినలేదు. ఒప్పుకోకేం చేస్తుంది? నవమాసాలు మోసిన కన్నకడుపు కొడుకును దూరం చేసుకోలేదు కదా? అయినా కడుపుతీపితో కోడలిని కూతురిగా చూసుకుంటున్నా అది ప్రతి విషయంలోనూ అత్తను అనుమానిస్తూ దెబ్బతీయాలనుకోవడంలో ఏం అర్థం ఉంటుంది?'' అంది వర్ధనమ్మ.

''ఆఁ. పైకి కొడుకు దగ్గర మంచి కోసం కోడల్ని కూతురిగా చూస్తున్నట్టు నటించడం, కొడుకు కనుమరుగైతే కోడల్ని ఆరళ్ళు పెట్టాలని వాళ్ళత్త చూడడం న్యాయమా?''

''కోడల్ని ఏం ఆరళ్ళు పెట్టిందే. పుట్టినరోజున తలంటుపోసింది. హారతిచ్చి అక్షింతలు వేసింది. కోడలికి తన పెన్షన్‌తో కొత్త చీర కొనిపెట్టింది'' అంటుండగా శైలజ మధ్యలో జోక్యం చేసుకుని ''అవునవును ఎందుక్కాదూ? అందుకే షాంపూలు వాడుతోన్న ఈరోజుల్లో కారం దంచిన రోకలితో కుంకుడు కాయలు కొట్టి నీరజ కంట్లో కారం కలిపిన కుంకుడు పులుసు పోసింది. ఎంత అభిమానం? ఆ అత్త అభిమానాన్ని మీరుగాక ఇంకెవరు పొగడగల్రు?''

''ఆవిణ్ణంటే పురుగులు కారిపోతారు? ఆ కుంకుళ్ళు దంచింది పనిమనిషి సీతాలు. దంచింది సీతాలయితే నింద అత్తగారిమీద మీద వేస్తావేం?'' అంది వర్ధనమ్మ.

''అంటే.. నేను తప్పన్నాను.. నేనే పురుగులు కారి ఛస్తానన్నమాట. వాళ్లవరకూ ఎందుకూ? మీ తత్వమే బయటపడిపోయింది. అక్కడికి నేను మిమ్మల్ని రాసి రంపాన పెడుతున్నట్టు..మీరేమో భరించలేక ఛస్తున్నట్టు కదా మీ భావన. అనండి. ఏం చేస్తాం? నా భర్త తల్లి చాటు బిడ్డడు కాబట్టే మీరేమైనా అంటారు'' అని కొంగుతో కళ్ళొత్తుకుంది.

''అదే మరి...ఏదన్నా మాటంటే దాన్ని వదిలేసి మధ్య నాకూ నీకూ లంకెలెడతావెందుకు? నేన్నిన్నేదైనా పన్నెత్తి మాటన్నానా? కన్నకూతురికి కూడా...పుట్టెడు రోగంతో మంచాన పడితే కాలి మీద చెయ్యి వెయ్యలేదు. నీకు జ్వరం వస్తే కాళ్ళొత్తాను. తలకు జండూబాం రాశాను. ఇవన్నీ ఏ అత్తగారు చేస్తుందే?'' అంది ముక్కుచీదుకుంటూ.

''అక్కడికి నేనే మీకు సేవలు చెయ్యలేదు కదండీ! మా అమ్మనడగండి. మా ఇంట్లో ఇక్కడి పూచిక పుల్ల అక్కడ పెట్టి ఎరుగను. బ్యాంకు మొగుడని పేరేకానీ నేనేం గర్వపడుతున్నానండీ? మీ బట్టలకి సబ్బు పెడుతున్నాను. రోజూ ప్రత్యేకంగా టిఫిన్ చేసి పెడుతున్నాను. మీరాసుపత్రిలో పదిరోజులుంటే నానా చాకిరీ చేశాను. ఏదైనా తల్లి తల్లే, అత్తగారు అత్తగారే. అదే నా తల్లే అయితే నా తల్లి ఎంత కష్టపడిపోయిందని ఎన్ని సార్లనేది? ఒక్కసారి మీరు గానీ...మీ అబ్బాయి గానీ నేను చేసిన సేవలు గుర్తించారా? పైగా అత్తగారికి అన్నీ చేసొచ్చేసరికి ఈవేళయిందంటే...అవుతుంది ఇలాంటప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చేస్తావ్? అని..మీకు సేవలు చేయడానికే నేను పుట్టినట్లు, ఆయన నన్ను పెళ్ళిచేసుకున్నట్టు మాట్లాడారు. నిజంగా నాకెంత కష్టమనిపించిందో..అప్పుడే ఏ నిద్రమాత్రలు మింగో చావాలనిపించింది. చేసిన సేవకు గుర్తింపులేనప్పుడు బతికితేనేం...ఛస్తేనేం?'' అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది వంటగదిలోకి.

ఇంతలో-

వీధిలోంచి వనజ స్నేహితురాలు గిరిజ హడావిడిగా వచ్చి ''వనజా! నీరజ చచ్చిపోయిందట'' అని తుర్రున పారిపోయింది. ఆ వార్త వినగానే వనజ దాని వెనుకే పారిపోయింది. వర్ధనమ్మ, శైలజా వనజ వెనకాల పరుగుతీస్తున్నా వనజ ఆగలేదు.


''భగవంతుడా! నీరజకేం కాకూడదు''

''నే చెప్పలా. అది తీసుకున్న గోతిలో అదే పడింది'' అంది వర్ధనమ్మ ముసిముసి నవ్వులతో. శైలజ తోక తొక్కిన త్రాచే అయింది ఏం తోచలేదు.

అసలేం జరిగిందంటే-

'అత్త ఒకనాటి కోడలే'- టెలీ సీరియల్‌లో 565 భాగంలో 'అత్తా-కోడళ్ళు' ఒకరి మీద ఒకరు కుయుక్తులు, కుట్రలు పన్నుకుని ఒకరికంటే మరొకరు తెలివిగా ప్రవర్తిస్తూ ఒకర్నొకరు దెబ్బతీయాలనుకుంటారు. అత్తగారు కోడలు తినబోయే అన్నంలో విషం కలుపుతుంది. కోడలు అన్నం నోట్లో పెట్టుకోబోయేంతలో పైనుంచి ఎలుక కంచంలో పడ్డం, కోడలు కంచంతో ఆ అన్నాన్ని కాలువలో పోసెయ్యడం జరుగుతుంది. ఆ తరువాత ఆ ఎలుక చావడంతో కోడలుకి అనుమానం వచ్చి వీధిలోనికెళ్ళి చూసేసరికి రెండు కుక్కలు ఆ విషాహారం తిని కాళ్ళు తన్నుకోవడం కనిపిస్తుంది. నీరజకు అత్తమీద అనుమానం వస్తుంది. కానీ అనుమానం బయటపెట్టకుండా భర్తకి విషయం చెబుతుంది. భర్త మౌనంగా విని ఊరుకుంటాడు. ఈ విషయాన్ని నీరజ మహిళామండలిలో పెడుతుంది. అత్తమీద దెబ్బతీయాలనుకుని అందరూ కలిసి ఓ పథకం వేస్తారు. ఆ పథకం పాతదే. అత్త తెల్లారి ముందుగా లేచి వంటగది సవరించి కాఫీ కలుపుకు త్రాగుతుంది. అందుకని పడుకోబోయే ముందు నీరజ గ్యాస్ లీక్ చేసి వంటగది తలుపువేస్తుంది. తెల్లారితే అత్తపీడ విరగడవుతుందనీ, ప్రతి దాడి విజయవంతంగా ముగుస్తుందని తుది విజయం నీరజదేనని మంచి పార్టీ చేయాలని మహిళామండలి నీరజకు అడ్వాన్స్‌గా అభినందనలు చెబుతుంది.

అదే జరిగితే మామూలు పార్టీకాదు, మరచిపోలేని పార్టీ ఇస్తానంటుంది నీరజ. అక్కడితో ఆరోజు భాగం అయిపోతుంది. మర్నాడు 566 భాగంలో నీరజ ఇంటి సీనే ఉండదు. వారం రోజుల తరువాత 573వ ఎపిసోడ్‌లో అనుకున్నట్లుగానే నీరజ గ్యాస్‌లీక్ చేసి ఏమీ ఎరగనట్టే భర్త దగ్గరకు వచ్చి కబుర్లు చెప్పడం..అత్తగారు కాళ్ళు సలుపుతున్నాయన్నారు- ఎంతైనా పెద్దావిడ కదా ఓసారి కాళ్ళు పట్టి వస్తానని వెళుతుంది నీరజ. కాళ్ళు ఒత్తుతుంది. 'ఏమిటి దీని మాస్టర్ ప్లాన్? ఏ కరెంట్‌తోనో ఎర్త్ ఇవ్వడానికి రాలేదుకదా?' అని అనుమానిస్తూనే కోడలిని అభిమానిస్తున్నట్లు నటి




స్తుంది.
నీరజ భర్త నీరజని ఆప్యాయంగా అల్లేసుకుంటాడు.

నాలుగ్గంటల సమయంలో నీరజ భర్త గుండెల్లో నొప్పి వస్తుందని అనడంతో హడావిడిలో కాఫీ కలిపి తెస్తానని వంట గదిలోకెళ్ళి స్విచ్ వెయ్యబోతుంది నీరజ.

ఈ సీన్ చూస్తున్న శైలజ గట్టిగా అరిచింది. గుండెలు దడదడా కొట్టుకున్నాయి. అంతలో కరెంట్ పోయింది. పోయిన కరెంట్ అరగంటవరకూ రాలేదు.

''నీరజ తాను గీసిన గోతిలో తనే పడింది'' అంది వర్ధనమ్మ.

''నో...నీరజ చచ్చిపోతే సీరియల్‌కే అర్థం ఉండదు''

''ఇంకేం జరుగుతుంది. తనే గ్యాస్ లీక్ చేసింది, మరిచిపోయింది. ఇప్పుడు తనే లైట్ వేసింది. కరెంట్ మనింట్లో పోయింది కానీ అక్కడ పోలేదు కదా! నీరజ ఈపాటికి తునాతునకలయిపోయి ఉంటుంది'' అంది వర్ధనమ్మ.

శైలజ అంగీకరించలేకపోయింది. టెన్షన్ తట్టుకోలేకపోయింది. తల బద్దలయిపోయింది. సీసా మొత్తం జండూబాం రాసినా ప్రయోజనం లేకపోయింది. నరాలు తెగిపోతుంటే జండూబాం ఏం పనిచేస్తుంది?

ఇంతలో..

గిరిజ ''నీరజ చచ్చిపోయింది'' అనే కబురు మోసుకొచ్చింది. చెప్పింది సరిగా చెప్పక తుర్రున పారిపోయింది.

వెంటనే తన ఫ్రెండ్‌కు ఫోన్‌చేసి ''రాత్రి 'అత్తా ఒకనాటి కోడలే' సీరియల్ చూశావా?'' అని అడిగేసరికి ''లేదు శైలూ! రాత్రి సినిమాకెళ్ళాం... ఏమయింది?'' అని తిరిగి ప్రశ్నించింది.

రెండు, మూడిళ్లకి ఫోన్ చేస్తే కొందరిళ్ళలో కరెంట్‌పోయి చూడలేదంటే మరికొందరు మరో ఛానల్లో 'అత్తను మించిన కోడలు' చూస్తూ ఉండిపోయాం' అని సమాధానం రావడంతో శైలజకేం తోచక హైదరాబాద్ ఫోన్ చేసింది మరో మిత్రురాలికి. అయితే ఫోన్ రింగవుతోంది కానీ ఎవరూ

**పి.వి.బి.శ్రీరామమూర్తి**

ఎత్తడం లేదు. గుంటూరు చేసింది తన చెల్లెలికి. ''మీరు డయల్ చేస్తున్న లైన్లన్నీ బిజీగా ఉన్నాయి. కాసేపు ఆగి ప్రయత్నించండి'' అని సమాధానం వచ్చింది.

''వెధవ ఫోన్లు సమయానికి పనిచేసి చావవు'' అనుకుని మెరుపులాంటి ఆలోచన రావడంతో వాళ్ళ చిన్నాన్న కూతురికి సెల్‌ఫోన్ చేసింది వైజాగ్‌కి. ఆమె ఫోన్ ఆఫ్ చేసేసినట్టుంది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

ఈలోగా వర్ధనమ్మ వీధిలోకెళ్ళింది.

''ఇదిగో పార్వతమ్మా! శుభవార్త. నీరజ తాను తీసుకున్న గోతిలో అదే పడింది. అత్తగారిని అంతం చేద్దామని గ్యాస్‌లీక్ చేసిందా? మరిచిపోయి అదే స్విచ్ ఆన్ చేసింది చచ్చి ఊరుకుంది'' అంది లక్ష రూపాయలు లాటరీ తగిలినంత ఆనందంతో.

అక్కడ చేరిన అత్తలందరి ముఖాలు వెయ్యి ఓల్టుల కాంతితో వెలిగిపోయాయి. ఇక్కడో విషయం చెప్పాలి. ఒక ఛానెల్లో 'అత్తా ఒకనాటి కోడలే' మరో ఛానల్లో 'అత్తను మించిన కోడలు' ఒకే సమయంలో వస్తూండడం చేత 'అత్తా ఒకనాటి కోడలు' కొంతమంది 'అత్తను మించిన కోడలు' మరికొంతమంది చూస్తున్నారు. అత్త సాధింపులు ఎక్కువగా ఉన్న 'అత్తను మించిన కోడలు' సీరియల్‌ని కోడళ్లు అత్తల ముందు వెయ్యటం మానేసారు. అత్తలందరూ పార్వతమ్మ ఇంట చేరి ఆ సీరియల్ చూద్దాం.. మధ్య మధ్య బ్రేకుల్లో రిమోట్ సాయంతో రెండో సీరియల్ చూడడం చేస్తున్నారు. అంతకుముందు ఏదోలా సర్దుకుపోయే 'అత్తాకోడళ్ళు' ఈ సీరియల్స్ ప్రసారం అయిన దగ్గర్నుంచి అత్తలూ, కోడళ్లూ రెండు భాగాలుగా విడిపోయి చర్చించుకోవడం ఇళ్లలో కూడా ఒకరిమీద ఒకరు సాధింపులూ,

వేధింపులతో కుట్రలూ, పన్నాగాలతో పేట్రేగిపోవడం జరుగుతోంది. అత్తాకోడళ్ళ మధ్య కొడుకులు అటు తల్లికి గానీ, ఇటు పెళ్ళానికి గానీ సర్దిచెప్పలేక నలిగిపోతున్నారు.

''అవునూ వర్ధనం! నీకెలా తెల్సిందే. రాత్రి కరెంట్ పోయింది కదా!'' అంది పార్వతి.

''అదిగో.. మా లచ్చెమ్మగారి మనవరాలు గిరిజ లేదూ! అది చెప్పింది'' అంది.

''అసలు రాత్రి మన టౌన్ మొత్తం కరెంట్ పోయింది కదా. దానికి మాత్రం ఎలా తెల్సిందీ?'' అడిగింది.

అప్పుడు వర్ధనమ్మకూ డౌటొచ్చింది. అప్పుడు గుర్తొచ్చింది. ''అవును సుమా నీరజంటే...లచ్చెమ్మ చెల్లెలు కూతురు కాదు కదా. దానికా మధ్య జబ్బు చేసి ఆసుపత్రిలో చేర్చారన్నారు. ఉండుమీ!'' అని ఇంట్లోకి పరుగెత్తింది.

''అవునే శైలూ! రాత్రి కరెంట్ ఊరు మొత్తం పోయింది. ఆ గిరిజ చనిపోయిందన్న నీరజ లచ్చెమ్మ చెల్లెలి కూతురు కాదు కదా! దానికామధ్య బాగాలేదని విన్నాం'' అంది.

వర్ధనమ్మ అలా అనడంతో శైలజకు ప్రాణం వచ్చినట్టయింది. అత్తగారి మీద అభిమానం పెరిగిపోయింది.

''ఒసే శైలజా! ఆ అవకాయ చచ్చీచెడీ బోల్డు డబ్బు తగలేసి పెట్టుకున్నాం. అవన్నీ కొట్టుగదిలో పెట్టెయ్. ఆ దేవుని గదికి తాళం వేసెయ్. ఎందుకైనా మంచిది ఆ మంచం మీద తలగడలూ, దుప్పట్లు తీసెయ్'' అంది.

శైలజ ఆనందంతో అత్తగారు చెప్పినట్లు చేసింది.

''అయినాగానీ వాళ్లో కబురైనా చెయ్యొచ్చుగా!''

''ఈ గిరిజనే పంపితే. ఇదిలా చెప్పి తగలడింది కామోసు''

''వాళ్ళకోసారి ఫోన్ చెయ్యవే!''

''ఏం చేస్తాం. మీ నీరజ చనిపోయిందా అంటే బాగుంటుందా?'' అంది శైలజ.

''అదికాదే. నీరజకెలా ఉంది? అని అడుగు'' అని సలహా ఇచ్చింది వర్ధనమ్మ. శైలజ ఫోన్ చేసింది ఎవరూ ఎత్తడం లేదు.

''ఏంటో అత్తయ్యా! ఎవరూ ఫోన్ ఎత్తడంలేదు. నిజంగా ఆ 'నీరజే' అయింటుంది. పోన్లెండి. హడలి చచ్చాను సీరియల్‌లో నీరజేమోనని'' అని తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది శైలజ.

ఇంతలో వర్ధనమ్మ కొడుకు వచ్చాడు.

''ఒరే రామూ! మన లచ్చెమ్మ చెల్లి కూతురు నీరజ లేదు.. అది పోయిందట్రా!'' అంది వర్ధనమ్మ.

''ఎవరు చెప్పారే?''

''వాళ్ళ గిరిజ''

''దాని ముఖం. అది నవ్వుతూ రిక్షాలో వెళ్తోంది''

''బావుందిరా బడాయి. నువ్వు దానిలాటి దాన్నే ఎవర్నో చూసి దాన్నే చూశాననుకున్నావ్''

''బావుందమ్మా. దాంతో నేను మాట్లాడాను. నెల రోజులు మందులు వాడమన్నారట డాక్టర్. మరేం ఫర్వాలేదన్నారని స్వయంగా అదే చెప్పేసినా!'' అని అన్నాడు రామం.

''ఆ...'' భార్య డీలాపడిపోయి సోఫాలో కూలబడిపోయింది.

''ఏ..ఏ..శైలూ...ఏవంయింది...ఏవంయింది?'' కంగారుగా వచ్చి శైలూ నుదుటిమీద చెయ్యి వేసి చూశాడు.

''అయితే...అత్తా ఒకనాటి కోడల్లో నీరజే పోయిందంటారా?'' నీరసంగా అడిగింది.

రామానికి కోపం తారాస్థాయికి వచ్చేసింది.

''ఏమండీ! నీరజకేం కాలేదని చెప్పండి. మీ నోటితో మీరు చెబితే తప్పక జరిగితీరుతుంది. నీరజకేం కాకపోతే సాయిబాబాకి పది రూపాయలు హుండీలో వేస్తాను'' అంది కళ్ళలో నీటి పొరలు కమ్ముకోగా.

''నీకేం మతిపోయిందా? టీవీ సీరియల్లో దానికేదో అయిపోతోందని నీకెందుకే అంత బాధ? ఎవరైనా వింటే నవ్వుతారు?'' అన్నాడు.

''అలా గడ్డిపెట్టు'' అంది వర్ధనమ్మ.

''మీరూరుకోండి అత్తయ్యా! అనవసరంగా నోరు పారేసుకోకండి. నీరజకేమయినా అయితే టీవీ బద్దలుకొట్టేస్తాను'' అంది కాళికలా.

రామానికి భయం వేసింది. నీరజ చచ్చిపోయిందని కాదు, భార్య కోపంతో నిజంగా టీవీ బద్దలు కొట్టేస్తే పదిహేను వేల రూపాయలు ముక్కలయినట్లే. కానీ దమ్మిడీ కాదు అనుకునేంతలో వనజ వచ్చింది.

''అమ్మా! మా ఫ్రెండ్.. అదే మా కాలేజీ అమ్మాయి నీరజ సూసైడ్ చేసుకుని చచ్చిపోయింది. నిన్న కాలేజీలో ర్యాగింగ్ జరిగిందట. అది భరించలేక ఆత్మహత్య చేసుకుంది'' అని ఆదరాబాదరాగా చెప్పింది.

''హమ్మయ్య! ఆ నీరజా! హడలిచచ్చాను సీరియల్‌లో నీరజనుకుని..'' అని శైలజ లేచి కూర్చునేసరికి రామానికి కోపం నషాళానికెక్కింది.

''ఏంటే! నువ్వు మనిషివేనా? నిజంగా ఒకమ్మాయి దారుణంగా రేగింగ్ చేయబడి చనిపోతే నీకు బాధ కలగలేదా? సీరియల్‌లో ఒక పాత్ర చనిపోయిందేమోనని అంతలా బాధపడిపోయావ్? ఇప్పుడు నువ్వు కాదు. నేనే ఆ టీవీని ముక్కలు ముక్కలు చేస్తాను. మానవత్వపు విలువల్నే కాలరాస్తోన్న ఆ ఇడియట్ బాక్స్ ఇక ఎంత మాత్రం ఉండడానికి వీల్లేదు?'' అని టీవీ వైపు విసురుగా అడుగులేశాడు రామం శైలజ ఎంత వారిస్తున్నా వినకుండా.

❀

## ఎప్పుడూ సిద్ధమే

**హాలీవుడ్, బాలీవుడ్ గురించి కొంచెం బాగానే తెలిసిన కాశ్మీరాషాని కదిపితే ఎన్నో సంగతులు జలపాతంలా ఉరుకుతాయి. 'బాలీవుడ్ నా రక్తంలో ప్రవహిస్తోంది. ఈ రెండుచోట్లా నాకు అంతో ఇంతో అనుభవం ఉంది. అయితే రెండింటినీ పోల్చి చూడకూడదు. దేని ప్రాధాన్యత దానిదే. నేనెక్కువగా హిందీ చిత్రాల్ని చూస్తాను. హాలీవుడ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అక్కడ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంటుంది. దానికి తగ్గట్టుగా పోటీ కూడా తీవ్రంగా ఉంటుంది. ఒక్కసారి ఆఫర్ వస్తే వారిని త్వరగా వదలరు. టాలెంట్‌ని బట్టి గుర్తింపు, రెమ్యూనరేషన్ ఉంటుంది.**

